క్లుప్తంగా

పండా వీధిలో కృపమయా ప్రార్థన



సుబ్రహ్మణ్యాన్ని సత్కరిస్తున్న పాస్టర్ మేరీ జోసెఫ్ తదితరులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజక వర్గ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన సుబ్రహ్మణ్యం (సువార్త రాజ్)ను పలువురు అభినందించారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయనను ఇటీవల క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నియమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం పండా వీధిలో కృపమయా ప్రార్థన నిర్వహించారు. పార్టీ అధినేతతో పాటు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సహకారం, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ ఆశీర్వాదంతో ఈ పదవి వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ మేరీ జోసెఫ్, సంఘ సభ్యులు సువార్త రాజ్ సుబ్రహ్మణ్యాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు వార్డు నాయకులు, సంఘీయులు పాల్గొన్నారు.

గ్రంథాలయం సేవలు భేష్



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు

అల్లిపురం: బాయమ్మ జంక్షన్‌లో గల శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి, గ్రంథాలయ అధికారి పీవీఎస్ రాజును నిర్వహణ తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో గ్రంథాలయానికి వచ్చే విధంగా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. కొత్త చందాదారులను పెంచాలి, అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సబ్జెక్టు పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు.

జోరుగా కల్వర్టు పనులు



కల్వర్ట్ పనులను పర్యవేక్షిస్తున్న తోట పద్మావతి, లింగం శ్రీనివాసరావు తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు పరిధి భూపేష్‌నగర్ కాలువపై పలకల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. కాలువపై పలకలు ధ్వంసం అయిన సందర్భంగా వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అభ్యర్థన మేరకు కొత్త పలకల ఏర్పాటుకు ప్రతిపాదించారు. పనుల కోసం రూ.4 లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. వార్డు నాయకులు లింగం శ్రీనివాస్, దానయ్యమ్మ, అప్పలరాజు, పోలారావు, రాములతో కలిసి పద్మావతి పనులను పర్యవేక్షించారు.

రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ వితరణ



టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ అందజేస్తున్న రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ సేవా కార్యక్రమంలో భాగంగా పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థకు రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్‌తో పాటు ఆశ్రమ వాసుల కోసం టీవీ బహూకరించారు. రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడు ధర్మేంద్ర, కార్యదర్శి శ్రావణి, కంచర్ల రాంప్రసాద్, అన్నపూర్ణమ్మ వీటిని అందజేశారు. వివేకానంద సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు, నిత్యాన్నదానం, వృద్ధాశ్రమ నిర్వహణ వంటివి ఆదర్శవంతమైనవని చెప్పారు. అలాగే రాంప్రసాద్ పర్యవేక్షణలో సంస్థకు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక అందుబాటులోకి తేవాలని నిరసన తెలుపుతున్న నిర్మాణ రంగ కార్మికులు (ఫైల్)

పనుల్లేవు.. పస్తులే

- బతుకు భారంగా మారిన భవన నిర్మాణ కార్మికులు
- పెరిగిన నిర్మాణ రంగ సామగ్రి ధరలు
- ధరల భారం తట్టుకోలేక నిర్మాణాలకు వెనుకంజ వేస్తున్న ప్రజలు

రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు వారివి. తమ రెక్కల కష్టంతో ఇంటిల్లిపాదినీ పోషించుకుంటున్నారు. నిత్యం శ్రమిస్తేనే కుటుంబం యావత్తు కలో గంజో తాగేది. అలాంటి కష్ట జీవులకు ఇప్పుడు పని కరవయింది. ఇప్పటి వరకు ఇసుక సరఫరా కొరత.. ఇప్పుడు భవన నిర్మాణ రంగ సామగ్రి ధరలకు రెక్కలు రావడంతో కార్మికుల జీవితాల్లో కారు మబ్బులు కమ్ముకున్నాయి. నియోజకవర్గ పరిధి అల్లిపురంలోని సింహాలదేవిడి, గొల్లలపాలెం సింగ్ హోటల్ జంక్షన్, కురుపాం మార్కెట్ మెయిన్‌రోడ్డు వద్ద మేస్త్రీలు వచ్చి తమను పనిలో తీసుకెళ్తారని ఆశగా చూడడం.. బారెడు పొద్దుపోయినా ఎవరి నుంచి పిలుపు రాక పోవడంతో నిరాశగా ఇంటి దారి పట్టడం నిత్యకృత్యమైపోయింది.



సింగ్ హోటల్ జంక్షన్ వద్ద పనుల కోసం నిరీక్షిస్తున్న కార్మికులు

దాబాగార్డెన్స్:

అల్లిపురం, పాతనగరం, సీతమ్మధార, అక్కయ్యపాలెం, కంచరపాలెం తదితర ప్రాంతాల్లోని కూడళ్లలో భవన నిర్మాణ కార్మికులు పొద్దున్నే మేస్త్రీలు తమను పనిలోకి తీసుకెళ్తారని.. ఆ రోజు భుక్తికి లోటు ఉండదని ఆశిస్తూ నిరీక్షిస్తుంటారు. గతంలో సంగతి అలా ఉంచితే ప్రస్తుతం మాత్రం వారి ఆశ నిరాశే అవుతోంది. ఇసుక కొరత.. భవన నిర్మాణ సామగ్రి ధరలకు రెక్కలు వచ్చిన నేపథ్యంలో వారికి పని దొరకడమే గగనమైపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 8 నెలలు కావస్తున్నా.. పనులు మెల్లమెల్లగా నిలిచిపోతున్నాయి. ఇంటి ముఖం పడుతున్న కూలీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఏదో పని దొరక్కపోతుందా అని కూడలికి చేరుకుని మధ్యాహ్నం వరకు ఆశగా ఎదురు చూస్తున్నారు. భోజనం కూడా తెచ్చుకోవడం మానేశారు. రోజురోజుకీ నమ్మకం సన్నగిల్లుతోంది. ఏం చేయాలో పాలుపోని స్థితిలో దినసరి కూలీలున్నారు.

ధరలకు రెక్కలు..

ఓ ఇల్లు కట్టాలంటే.. ఇసుక, ఇటుక, పిక్క, స్టీల్, సిమెంట్‌తో పాటు నిర్మాణ రంగ పనివారు అవసరం. సామగ్రి అందుబాటులో ఉంటే.. ఎవరైనా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వస్తారు. కానీ నిర్మాణ రంగ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. ఇసుక 3 టన్నులు రూ.10 నుంచి రూ.11వేలు, ఇటుక ఒక్కటి రూ.11, పిక్క (కంకర) రూ.10 నుంచి రూ. 11 వేలు (3 యూనిట్లు), సిమెంట్ రూ.340 నుంచి రూ.350 (బస్తా), టన్ను స్టీల్ రూ.75 వేల పైమాటే. దీంతో పాటు సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ అదనం. ధరలు అమాంతంగా పెరిగిపోవడంతో నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదంటూ భవన నిర్మాణ రంగ పనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు అందుబాటులో ఉంటే ఎవరైనా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు వస్తారని, పెరిగిన ధరల వల్ల వేలాది మంది భవన నిర్మాణ కార్మికులకు పని దొరకడం లేదని కార్మికులు సాక్షి దృష్టికి తీసుకొచ్చారు.

పని దొరక్క పస్తులుంటున్నాం

దినసరి కూలీల జీవన స్థితిగతులు దిగజారిపోతున్నాయి. ఏ రోజు పని దొరుకుతుందో, ఏ రోజు పని దొరకదో తెలియని పరిస్థితి. మధ్యాహ్నం వరకు ఉంటే ఏమైనా పని దొరుకుతుందేమోనని ఆశ చావక ఇక్కడ నిలబడి ఉన్నాం. పని దొరికితే గుప్పెడు మెతుకులు తింటాం.

– అప్పారావు, తాపీ మేస్త్రీ, పాతనగరం

ఏడు నెలలుగా ఇబ్బంది..

ఏ రోజు కూలీ ఆ రోజు తెచ్చుకుని బతుకీడుస్తున్నాం. ఏడు నెలల నుంచి పనులు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న కాస్తో కూస్తో వస్తువులు కుదువ పెట్టి నెట్టుకొస్తున్నాం. అప్పులు చేయడంతో వడ్డీలు కూడా మాకు పెనుభారంగా మారుతున్నాయి.

– సత్తమ్మ, కూలీ, చిలకపేట


ఎవరూ నిర్మాణాలు చేపట్టడంలేదు..



కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి బడుగులకు కష్టాలు మొదలయ్యాయి. ఉచిత ఇసుక అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడెనిమిది నెలలు దాటిన తర్వాత ఇసుక అరకొరగా దొరుకుతుందనుకుంటే..భవన నిర్మాణ రంగ సామగ్రి ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఎవరూ నిర్మాణాలు చేపట్టడం లేదు. పోనీ ఎవరైనా పనులు చేపట్టాలని ముందుకు వస్తే.. జీవీఎంసీ సిబ్బంది టార్చర్ భరించలేకపోతున్నారు. ఏ మాత్రం ఇసుక/ఇటుక రోడ్డుపై వేస్తే సచివాలయ సిబ్బంది ఆఘమేఘాలపై వాలుతున్నారు. పెనాల్టీలు విధిస్తున్నారు. పరిస్థితులు బాగులేవు. భవన నిర్మాణ రంగ పనివారికి పనులు దొరకడం లేదు. ప్రభుత్వం నిర్మాణ రంగ సామగ్రి ధరలు తగ్గించాలి. రోడ్డున పడ్డ కూలీల గురించి ప్రభుత్వం ఆలోచించాలి.

– కోట సత్తిబాబు, రాష్ట్ర నాయకుడు, ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నిధులు కేటాయించాలి



నరవ ప్రకాశరావు

దాబాగార్డెన్స్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు లేఖ పంపారు. ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ బడుల బలోపేతానికి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించే అవసరం ఉందన్నారు. ఇప్పటికే కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేటాయిస్తున్న నిధులు అంతకంతకు తగ్గుతున్న నేపథ్యంలో నాణ్యమైన విద్య అందిస్తామన్న వాగ్దానాన్ని నెరవేర్చాలంటే ప్రాథమిక విద్యాభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. జాతీయ విద్యా విధానం.. విద్యా హక్కు చట్టంలో ప్రమాణాలతో కూడిన ఆధునిక నాణ్యమైన విద్య అందిస్తామని వాగ్దానం చేసారు కానీ కార్యరూపం దాల్చడం లేదని, రాష్ట్రంలో ప్రైవేట్ బడులే అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. పాఠశాల విద్య బలోపేతానికి కావల్సిన తరగతి గదులు, టీచర్స్, బోధన కిట్లు, గ్రంథాలయాలు, ఆటస్థలాల వంటివి అందుబాటులో లేవని చెప్పారు. విద్యా హక్కు చట్టం కేవలం 26.3 శాతం మాత్రమే అమల్లో ఉందని, విద్యపై విధాన ప్రకటన చేయాలన్నారు.

ఘనంగా శ్రీ సాయి దుర్గా గణపతి ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో గణపతి, దుర్గమ్మ, సాయిబాబా

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై వెలసిన శ్రీ సాయి దుర్గా గణపతి ఆలయ 12వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఎం.గణేష్‌శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి, సాయిబాబా, దుర్గమ్మ విగ్రహాలను అలంకరించి, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్ర నామార్చనలు, శ్రీలలితా పారాయణ సంకీర్తన జరిగింది. మధ్యాహ్నం దేవాలయం ఆవరణలో మహా అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం వెంకటేశ్వరమెట్ట, గోవింద్ రోడ్డు, నారాయణవీధి తదితర ప్రాంతాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు బి.సుజాత, ఎ. సీతాదేవి, వి.పద్మావతి, బి.విమల, కె. వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను నిరసిస్తూ కార్మిక సంఘాల ప్రదర్శన



నిరసన ప్రదర్శనలో యూనియన్ల నాయకులు

దాబాగార్డెన్స్: మోదీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం డాబాగార్డెన్స్ బీఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం వద్ద కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి. పలు యూనియన్ల నాయకులు పీఈసీహెచ్‌వీ సాగర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, దొర, సురేష్ మాట్లాడుతూ 2025–26 బడ్జెట్ చూస్తే మోదీ ప్రభుత్వం సంపన్నులు, కార్పొరేట్ల ప్రయోజనాలు పరిరక్షించేందుకే కట్టుబడి ఉందని, ఆర్థిక వ్యవస్థలో మాంద్యాన్ని నివారించేందుకు కట్టుబడి లేదని, ప్రజా రంగాలకు కేటాయింపులు పెంచకుండా తగ్గించడానికి, ప్రభుత్వ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రైవేట్ పరం చేసేందుకు కట్టుబడి ఉందని ఆరోపించారు. పీపీపీ పేరిట ప్రజల సొమ్మును కార్పొరేట్లకు మళ్లించే విధానానిన విరమించాలని, ఇన్సూరెన్స్ రంగంలో శత శాతం ఎఫ్‌డీఐలను అనుమతించే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని, మున్సిపల్ సర్వీసుల రేట్లు భారీగా పెరిగేందుకు దారి తీసే పట్టణ సంస్కరణల విధానాలు విరమించుకోవాలని, ఎలక్ట్రిసిటీ రేట్లు భారీగా పెరగడానికి దారి తీసే ఎలక్ట్రిసిటీ సంస్కరణలు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ కార్మికులు, ఉద్యోగులు, ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్నందున, ప్రభుత్వ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రైవేట్ పరం చేసేదిగా ఉన్నందున దేశంలోని 10 కేంద్ర కార్మిక సంఘాలు, ఆలిండియా బీఎస్‌ఎన్‌ఎల్ యూనియన్లు పిలుపునివ్వడంతో నిరసన చేపట్టినట్లు తెలిపారు.

కేజీహెచ్‌లో పటిష్ట భద్రతా చర్యలు

- ఆక్సిజన్ ప్లాంట్ పైపుల కోసివేతతో అప్రమత్తం



ఆక్సిజన్ ప్లాంట్ పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఒక రౌడీషీటర్ మద్యం తాగేందుకు డబ్బుల కోసం ఆక్సిజన్ ప్లాంట్ వద్ద ఉన్న పైపులను కోసిన ఘటన నేపథ్యంలో ఆస్పత్రి వైద్యవర్గాలు అప్రమత్తమయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ఆధ్వర్యంలో డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీ లత సీఎస్‌ఆర్ బ్లాక్ వద్ద ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ పరిసరాలను తనిఖీ చేశారు. బయట వ్యక్తులు లోపలికి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు, ప్లాంట్ వాల్వు వద్ద కూడా పూర్తిస్థాయిలో భద్రతా చర్యలు తీసుకునే విధంగా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆక్సిజన్ ప్లాంట్ వద్ద వాల్వు భవిష్యత్తులో కోతకు గురి కాకుండా ప్రత్యేకంగా బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు పైపులైన్ల సంరక్షణకు కూడా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం క్యాజువాల్టీ వద్ద ఉన్న అవుట్ పోస్టుతో పాటు, మరో అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశామని సూపరింటెండెంట్ వివరించారు. ఆస్పత్రిలో రాత్రిళ్లు మరింత మంది సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం దేవస్థానం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. భక్తుల గోత్రనామాలతో విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించగా.. ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మహిళ అభ్యర్థన

దాబాగార్డెన్స్: న్యాయం చేయాలంటూ ఓ మహిళ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు తెలిపిన వివరాలివి. గత ఏడాది మార్చి 22న ఏవీఎన్ కళాశాల డౌన్ రోడ్డులో నివాసం ఉంటున్న మైలపల్లి రాముతో తనకు వివాహం జరిగిందని దేవి తెలిపింది. రాము మద్దిలపాలెంలో గల సీఎంఆర్ ఫర్నిచర్‌లో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్నాడని పేర్కొంది. కొన్నాళ్లకు తనకు ప్రెగ్నెన్సీ వస్తే విషయం తన భర్త రాముకు, అత్తకు చెప్పానని, వాళ్లు ఈ ప్రెగ్నన్సీ వద్దని తనను కొట్టారని ఆమె తెలిపింది. కడుపు తీసుకోకపోతే చంపుతామని బెదిరించారని, కడుపు మీద తన్నారని, తన భర్త జుట్టు పట్టుకుని కొట్టాడని, ఇది తెలిసి తన తల్లి, అక్క వారిద్దరినీ నిలదీస్తే వారిని కూడా కొట్టారని, తన అన్నయ్యను కూడా కొట్టడానికి ప్రయత్నిస్తున్నారని దేవి చెప్పింది. వివాహ సమయంలో రూ.4 లక్షల కట్నం మాట్లాడగా, రూ.3 లక్షలు ఇచ్చామని, రూ.లక్ష ఇంకా ఇవ్వలేదని వేధిస్తున్నారని తెలిపింది. సమస్యల పరిష్కారం కోసం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించినట్లు దేవీ తెలిపింది.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి వినతి



సీఎంవోహెచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు

దాబాగార్డెన్స్: కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, రిటైరైన కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ కార్మికుల వారసులను విధుల్లోకి తీసుకోవాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా కమిటీ బుధవారం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేసింది. జీతాల ఆలస్యాన్ని సరి చేయాలని, సప్లిమెంటరీ బిల్లులు చెల్లించాలని, బకాయి హెల్త్ అలవెన్స్ చెల్లించి, నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. సీఎంవోహెచ్‌ను కలిసిన వారిలో యూనియన్ అధ్యక్షుడు టి. నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, జేఆర్ నాయుడు, ఆదినారాయణ, గొలగాని అప్పారావు తదితరులు ఉన్నారు.

అధినేతతో రాజీవ్‌గాంధీ భేటీ



మాజీ సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కొండా రాజీవ్ గాంధీ

మహారాణిపేట: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించారు.

కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కెరీర్ గైడెన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్, జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఫేస్ ప్రిపరేషన్, లింక్డ్ ఇన్ భాగస్వామ్యంతో 'కెరీర్ కిక్ స్టార్టర్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. కెరీర్ గైడెన్స్ శిక్షణ ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వివిధ స్కిల్ కోర్సులను నావిగేట్ చేయడానికి విద్యార్థులకు శిక్షణ ఇస్తుందని, విద్యార్థులు కెరీర్ అవకాశాలు లాక్ చేయడానికి వీలు కలిగిస్తుందన్నారు. కంప్యూటర్స్, క్రియేటివిటీ, టెక్నాలజీ అనే మూడు కీలక విభాగాల్లో లింక్డ్ ఇన్ లెర్నింగ్ కోర్సులు ఎలా సమర్థవంతంగా బ్రౌజ్ చేయాలో, యాక్సెస్ చేయాలో విద్యార్థులకు ఈ వర్క్‌షాప్ సహాయపడుతుందన్నారు. రీసోర్స్ పర్సన్స్ కె. దివ్య, వై. దీప్తి విద్యార్థులకు లింక్డ్ ఇన్‌లో నమోదు చేసుకోవడానికి సహాయం అందించారు. అలాగే సొంత కెరీర్ మార్గాలు సృష్టించుకోవడానికి వీలు కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కెరీర్ గైడెన్స్ కో ఆర్డినేటర్ జె. సునీత, జేకేసీ కో ఆర్డినేటర్ ఎం. విద్యాకల్పన, మెంటార్లు ప్రజ్ఞ, రాజు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంతో మంది బలిదానంతో వచ్చిందే విశాఖ ఉక్కు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో పాల్గొన్న సీఎఫ్‌టీయూఐ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఎఫ్‌టీయూఐ ఆధ్వర్యంలో నాయకులు నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు నీలాపు కనకారావు మాట్లాడుతూ ఎంతో మంది బలిదానంతో స్టీల్‌ప్లాంట్ వచ్చిందని, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిందన్నారు. అటువంటి ప్రభుత్వ రంగ సంస్థను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. స్టీల్ ప్లాంట్ దగ్గరికి వస్తే తరిమి కొడతామని, ప్లాంట్‌కు ఎవరు వచ్చినా అడ్డుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా ఆశించకుండా దేశంలోనే అత్యుత్తమంగా నడుపుతున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తాం అని బాధ్యతారాహిత్యంగా మాట్లాడితే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.లక్ష్మి, బుజ్జి పైడమ్మ, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పైడా కృష్ణప్రసాద్, విద్యార్థులు

దాబాగార్డెన్స్: రక్తదానం చేయడం ద్వారా ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చని పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పాత జైల్ రోడ్డు రెడ్నం గార్డెన్స్‌లో గల పైడా మహిళా డిగ్రీ కళాశాల, పైడా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పైడా కృష్ణప్రసాద్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు మంచి నడవడిక అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ఆర్గనైజర్ గీత, రోటరీ క్లబ్ విశాఖ అధ్యక్షుడు ధర్మేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సరోజ్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు రామశేషు, మౌనిక, పలువురు అధ్యాపకులు, అధిక సంఖ్యలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఏకాగ్రత ముఖ్యం



డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు ఏపీఎస్‌ఆర్‌టీసీ డ్రైవర్స్ ఫ్యామిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవర్స్ విధి విధానాలు, కుటుంబ సమస్యలు ఫ్యామిలీ సభ్యులతో చర్చించారు. వారి శ్రేయస్సు, ఏకాగ్రత, ఎటువంటి సమస్యలు లేకుండా ఏ రకంగా ఉండాలో డ్రైవర్లకు సూచనలు చేశారు. డ్రైవర్ ఉద్యోగం చాలా క్లిష్టమైనదని, డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సు నడపాలని సూచించారు. కుటుంబ సమస్యలు ఏమైనా ఉంటే అసిస్టెంట్ మేనేజర్, డిపో మేనేజర్‌కు తెలిపి, వారి సహాయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశాఖ డిపో మేనేజర్ గంగాధర్, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్మన్ అశ్విని, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.